తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## మామిడికాయల లారీ బోల్తా
### రూ.లక్షకు పైగా నష్టం

శాంతిపురం, జూలై 15 ప్రభాతవార్త



కర్ణాటకలోని రాజుపేట రోడ్‌నుంచి తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి మామిడి కాయల లోడ్డుతో వెళ్తున్న లారీ మండలంలోని కనమలదొడ్డి (ఏడోమైలు)వద్ద సోమవారం జాతీయ రహదారిలో బోల్తా పడింది. దీ ంతో వాహనంలో ఉన్న మామిడి కాయ లన్నీ రోడ్డు పాలయ్యాయి. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. లారీ జాతీయ రహదారిలో బోల్తా పడడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న రాళ్లబూదుగూరు పోలీసులు జెసిబిసాయంతో లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు క్లియర్ చేశారు. కాగా ఈ ప్రమాదంతో దాదాపు లక్షకు పైబడి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

## నాణ్యత ఆహారపదార్ధాల సరఫరాపై ఈఓ సమీక్ష

తిరుపతిటౌన్, జులై 15ప్రభాతవార్త:



టిటిడిలో అన్నప్రసాదాలు, నైవేద్యం, ప్రసాదాల తయారీకి వినియోగించే బియ్యం, ఆహార పదార్థాలు నాణ్యతవి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని టిటిడి ఈఓ జె. శ్యామలరావు అధికారు లను ఆదేశించారు. సోమవారం టిటిడి పరిపాలన భవనంలో జెఈఓ గౌతమి. వీరబ్రహ్మం, సిపిఆర్ఓ డాక్టర్‌తలారి రవి, ఎఫ్ఎస్ఎఐ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నోడల్ అధికారి రీవంద్రారెడ్డితో కలసి సమీక్షించారు.

# కలుషిత ఆహారం తిని విద్యార్థులకు అస్వస్థత

### ఐదుగురి పరిస్థితి విషమం - అధికారులు, డాక్టర్ల నిర్లక్ష్యం - గురుకుల ప్రిన్సిపాల్, వార్డెన్‌పై కలెక్టర్ వేటు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్ధులను పరామర్శిస్తున్న మంత్రి బాల వీరాంజనేయ స్వామి

నాయుడుపేట, జూలై 15 ప్రభాతవార్త

నాయుడుపేట పట్టణం ఎల్ఎసాగరంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం అర్ధరాత్రి పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురై అరుపులు కేకలతో అలమటించిన ఘటన సంచలనం రేకెత్తించింది. ఆదివారం రాత్రి 90 మందికి పైగా అస్వస్థతకు గురికాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 136కి చేరుకుంది. వీరిలో ఐదుగురు పరిస్థితి విషమంగా మారింది. శనివారం రాత్రి తయారు చేసిన పూరీలను ఆదివారం ఉదయం పెట్టడమే కాకుండా, మధ్యాహ్నం వండిన చికెన్ కర్రీ రాత్రి కూడా పెట్టారని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు సైతం వాపోయారు. దీంతో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయి రాత్రి నుంచి వాంతులు, విరేచనాలు అయ్యాయని తెలిపారు. కొంతమంది విద్యార్థులు మధ్యాహ్నం నుంచి అస్వస్థతకు గురవుతున్నా గురుకులం ప్రిన్సిపాల్ దాదాపీర్‌తో పాటు వార్డెన్ విజయభాస్కర్ విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయకుండా గోప్యంగా ఉంచారు. కానీ, విద్యార్థుల పరిస్థితి క్రమంగా విషమంగా మారడంతో చేసేది లేక నాయుడుపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులకు సమాచారం అందించి గురుకులంలోనే విద్యార్థులకు రహస్యంగా చికిత్స అందించారు. అయితే పరిస్థితి మరింత తీవ్రం కావడంతో నాయుడుపేట పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా, అక్కడ సేవలు అందించాల్సిన వైద్యులు అందుబాటులో లేకపోవడం, ఉన్న అరకొర డాక్టర్ల వైద్యంతోనే సరిపెట్టారు. ఇదిలావుంటే విద్యార్థులు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రికి వస్తే ప్రభుత్వ వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి ఇక్కడికి వచ్చే రోగుల ఆరోగ్య భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన సూపరిండెంట్ డాక్టర్ చంద్రకళ ఆసుపత్రికి రాకపోగా ఉన్న డాక్టర్లకు సైతం సమాచారం ఇచ్చి వైద్యసేవలు అందించడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపారు.

**మంత్రి పరామర్శ**

గూడూరు ప్రభుత్వ ఆసుప్రతిలో చికిత్స పొందుతున్న నాయుడుపేట గురుకుల పాఠశాల విద్యార్థులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వీర ఆంజనేయులు, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, పాశం సునీల్ కుమార్ సోమవారం గూడూరు ప్రాంతీయ శాఖలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. మెరుగైన వైద్యం సేవలు అందించాలని మంత్రి డాక్టర్లను ఆదేశించారు. మంత్రి వీరాంజనేయులు మాట్లాడుతూ నాయుడుపేట గురుకుల పాఠశాలలో ముందు రోజు వండిన కలుషితమైన ఆహారం తీసుకోవడంతో విద్యార్థులు అస్వస్థకు గురయ్యారని సంఘటన తెలిసిన వెంటనే వైద్యలతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సంఘటనకు సంబంధించి జాయింట్ కలెక్టర్‌తో కమిటీ వేస్తున్నామని విచారణ జరిగించి నివేదిక ఆధారంగా దీనికి కారణమైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముందుగా మంత్రి బాల వీరాంజనేయ స్వామి రాకతో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు జాతీయ రహదారిలోని పోటు పాలెం కూడలిలో మంత్రికి గన స్వాగతం పలికారు. పూల మాల శాలువాలతో ఘనంగా సన్మానించారు. వీరి వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డిఎంహెచ్ఓ శ్రీహరి, డిప్యూటీ డిఎంహెచ్ఓ మస్తానమ్మ సూపరింటెండెంట్ షారిన, తేదేపా నాయకులు అరికట్ల మస్తాన్ నాయుడు, వాటంబెట్టి శివకుమార్, రహీం భాయ్ మరి

## విద్యార్థులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించండి:ఎంపి

నాయుడుపేట, జూలై 15 ప్రభాతవార్త

నాయుడుపేట పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న గురుకుల పాఠశాల విద్యార్థులను తిరుపతి ఎంపీ గురుమూర్తి సోమవారం పరామర్శించారు. ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించడంతో పాటు ధైర్యం చెప్పారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో మాట్లాడి విద్యార్థులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. అనంతరం గురుకుల పాఠశాలకు వెళ్లి ఫుడ్ పాయిజన్‌కు కారణాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు రక్షిత తాగునీటిని ఏర్పాటు చేసేందుకు ఎంపీ నిధుల నుంచి కేటాయిస్తామని, అవసరమైన ప్రతిపాదనలు పంపాలని కోరారు.



# గోవిందుని సేవాభాగ్యం ఎవరికో!?

### మరో వారం రోజులు ఆగాల్సిందే !



తిరుమల, జూలై 15 ప్రభాతవార్త:

జిల్లాలోని ప్రముఖ దేవాలయం టిటిడి బోర్డుపై ఆశావహుల్లో మళ్ళీ ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటివరకు ఒకరిద్దరు టిటిడి బోర్డులో ఛైర్మన్ పదవిని కాంక్షిస్తూ తమవంతు ప్రయత్నాలు చేస్తున్న నాయకులు కూడా ముఖ్యమంత్రి బిజీ కార్యక్రమాలతో స్తబ్ధుగా ఉంటున్నారు. ఇప్పటికే పలువురు ప్రముఖ నేతలు, టిడిపిలో సీనియర్ నేతలు, మంత్రి పదవులు దక్కని ఎంపిలు, ఎమ్మెల్యేలు టిటిడి బోర్డులో పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ దఫా రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమిప్రభుత్వం ఏర్పాటుతో ఆశావహులు మూడు పార్టీల వాళ్ళు ఉండటం విశేషం. ఈ నేపథ్యంలో ఎంతో కీలకమైన, ప్రాధాన్యత ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానమ్ ధర్మకర్తలమండలి ఛైర్మన్ పదవి కోసం అటు టిడిపి ఎంపిలు, ఎమ్మెల్యేలతో బాటు జనసేన పార్టీకి చెందిన ఇద్దరు ప్రముఖులు పోటీలో ఉన్నారనేది ప్రచారం సాగుతోంది. దేశంలోనే గాక విదేశాల్లోని రాజ్యాంగ పదవుల్లో ఉన్న ప్రముఖులతో సమాన హోదా కలిగిన టిటిడి ఛైర్మన్ పదవి కోసం ఇప్పటికే ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణమరాజు, మురళీమోహన్, రాఘవేంద్రరావు, అశ్వనీదత్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సోదరుడు నాగబాబు ఇలా పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో భక్తులతో మమేకమవ్వడం, అందరినీ కలుపుకుని పనిచేసే సామర్థ్యం,భక్తివిశ్వాసాలు కలిగి ఉన్నట్లు పార్టీలో చర్చసాగుతున్న ఉండి ఎమ్మెల్యే పేరు తొలిప్రాధాన్యతలో పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరీ ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు మదిలో ఎవరికి స్థానం ఉందనేది మాత్రం అంచనా వేయలేకపోతున్నారు. ఈ దఫా టిటిడి బోర్డును పూర్తిగా ఆధ్యాత్మిక,సేవాభావం కలిగిన వ్యక్తులకే కట్టబెట్టి, పూర్తిగా స్వామివారి ఖ్యాతిని ఆధ్యాత్మిక, ధార్మిక రీతిలో ముందుకు తీసుకెళ్ళాలనే లక్ష్యంతో ఉన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం, జులై 15, ప్రభాతవార్త



ప్రజల సహకారంతో శాంతి భద్రతలు పరరక్షిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తామని, నూతనంగా జిల్లా ఎస్పిగా బాధ్యతలు స్వీకరించిన ఎల్. సుబ్బరాయుడు పేర్కొన్నారు. సోమవారం తిరుపతి జిల్లా ఎస్పిగా ఎల్ సుబ్బ రాయుడు బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జిల్లా ఎస్పికి జిల్లా అదనపు ఎస్పిలు పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి ఎల్ సుబ్బరాయుడు మాట్లాడుతూ తిరుపతి ఒక ప్రతిష్టాత్మకమైన జిల్లా అనునిత్యం శ్రీ వారి దర్శనార్థం ఇక్కడికి భక్తులు వస్తుంటారు. వారికి ఎటువంటి సమస్యలు లేకుండా శాంతి భద్రతలను కాపాడుతామన్నారు. ప్రజలు, మీడియా, ప్రజాప్రతినిధుల సహకారంతో సమర్ధవంతంగా శాంతిభద్ర తలను కాపాడుతామని జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా అదనపు ఎస్పిలు వెంకట్రావు, పరిపాలన కులశేఖర్ శాంతి భద్రతలు, విమల కుమారి నేర విభాగం, జిల్లాలోని డిఎస్పిలు, సిఐటు, ఆర్ఐలు, ఎస్ఐలు ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొని జిల్లా ఎస్పికి ఘనంగా స్వాగతం పలికారు.

## రెస్కో కార్యాలయంలో ట్రాన్స్‌కో విజిలెన్స్ బృందం విచారణ

కుప్పం, జూలై 15 ప్రభాతవార్త



కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార స ంఘం (రెస్కో) పరిధిలో చోటు చేసుకున్న అవకతవకలను బహిర్గతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా సోమవారం ఎపిట్రాన్స్‌కో విజిలెన్స్ శాఖ కుప్పం రెస్కో కార్యాలయంలో విచారణ నిమిత్తం చేరుకుంది. ట్రాన్స్‌కో విజిలెన్స్ సిఐ సుబ్రమణ్యం నేతృత్వంలో ఎస్సైలు వెంకటచిన్నా, ధరణీధర్,మరికొందరు సిబ్బంది సోమవారం రాత్రి దాకా రెస్కోలో చోటు చేసుకున్న అవకతవకలపై ఆరా తీశారు. ప్రధానంగా రెస్కో పరిధిలో చేపట్టిన ఉద్యోగ నియామకాలు, పదోన్నతులు, టెండర్ల నిర్వహణ, సంస్థ పరిధిలో చేపట్టిన కొనుగోళ్ల లావాదేవీలు తదితర అంశాలకు సంబంధించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మంగళవారం సైతం విజిలెన్స్ బృందం పలు అంశాలపై విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

### కరెంట్ షాక్‌కు గురై

# మహిళ బలి

### -మామిడి తోటకు వేసిన కంచెలో విద్యుత్

వి.కోట,జూలై 15,ప్రభాతవార్త:



ఓ రైతు నిర్లక్ష్యం ఓ మహిళ మృతికి కారణమైన ఘటన చిత్తూరు జిల్లా వి.కోట మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఓ రైతు తన పొలం చుట్టు ఏర్పాటు చేసిన కంచెకు విద్యుత్ తీగలు అమర్చిన విషయం తెలియని ఓ మహిళ ఆ కంచెకు ముట్టుకొగా విద్యుత్ షాక్‌కు బలైంది.స్థానికుల కథనం మేరకు మండలంలోని యాలకల్లు గ్రామ పంచాయితీ కే.పి.బండ గ్రామానికి చెందిన ఆయాజాన్ భార్య ఆసిఫా(35)పాడి పోషణ,కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.వి.కోట పట్టణానికి చెందిన ఓ టిడిపి నాయకులు అదే గ్రామంలో ఆయన మామిడి తోటకు ఇనుప కంచె వేయడం జరిగింది.ఆయన తోటను వన్యప్రాణులు నుండి రక్షించుకోవటానికై కంచెకు విద్యుత్ సరఫరా చేయించారు.ఈ విషయం తెలియని ఆసాఫా ఎప్పటిలా ఉదయం ఇంటి వద్ద కంచెకు సమీపంలో వంట సామాగ్రి శుభ్రపరచుకోవడం చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా తన శరీరం కంచెకు తాకడంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది.ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు గ్రామస్తులకు సమాచారం అందించడంతో గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు.అయితే అప్పటికే ఆమె మృతి చెందడం జరిగింది.సమాచారం తెలుసు కున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి సమందిత రైతుపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి సల్మా(11),అల్పి(7) ఇద్దరు పిల్లలు ఉన్నారు.మృతదేహం వద్ద ఆ చిన్నారులు రోధించడం తో గ్రామస్తులు ఛలించిపోయారు.తోట చుట్టూ కంచెకు విద్యుత్ సరఫరాచేసి ఓ మహిళ,రెండు శున కాల మృతికి కారణమైన చక్రపాణి నాయుడుపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

### పలమనేరులో

# చిరుత కలకలం

### - పులి దాడిలో ఆవు,లేగ దూడ మృతి

పలమనేరు,జూలై 15,ప్రభాతవార్త:



పలమనేరులో చిరుత కలకలం రేపుతుంది.ఇప్పటి వరకు పలమనేరు పరిసర ప్రాంతాలలో వన్య మృగాల దాడులు చూడని ప్రజలు సోమవారం జరిగిన సంఘటనతో ఒక్కసారిగా ఉల్లిక్కిపడ్డారు. మం డలంలోని నలగాంపల్లె గ్రామంలో గోవింద స్వామి అనే రైతు అటవీ సమీపంతో తన పొలం వద్ద వ్యవసాయం చేస్తు జీవనం సాగిస్తున్నారు.ఈ క్రమంలో ప్రతి రోజులా ఆయన పొలం వద్ద పశువులను కట్టి ఉంచగా అటవీ ప్రాంతం నుండి ఓ వన్యమృగం దాడి చేయడం జరిగింది.ఈ దాడిలో ఓ ఆవు,లేగదూడ మృతి చెందింది.దీనిపై బాధితుడు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో అటవీశాఖ అధికారులు ఎఫ్ఆర్ఓ శివయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి వన్యమృగం దాడిలో ఆవు,లేగదూడ మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.రాత్రి వర్షం కారణంగా ఏ మృగం దాడి చేసిందో నిర్ధారించలేకపోతున్నామని,గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతంలో ఇప్పటి వరకు మృగాల సంచారం గుర్తించలేదని ప్రత్యేక బృందాలతో రాత్రి సమయంలో నిఘా ఏర్పాటు చేసి వన్య మృగాలను గుర్తిస్తామని తెలిపారు.ఏదేమైనప్పటికి అటవీ సమీప గ్రామస్తులు,రైతులు ఈ దాడి చిరుతదే అంటు గత వారంలో సైతం దాడిలో సమీపంలోని గ్రామంలోని ఓ రైతు ఆవు మృతి చెందినట్లు తెలిపారు.అయితే ఇదివరకే బైరెడ్డిపల్లె,బంగారుపాళ్యం మండలాలలో అటవీ ప్రాంతం సమీపంలోని రైతులు చిరుతను చూసినట్లు కచ్చితంగా ఈ దాడి చిరుత చేసి ఉంటుందని రైతులు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని చిరుత నుండి పశువులతో పాటు తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

### కార్యదర్శులు లేక కుంటుపడిన

# గ్రామ పంచాయతి పాలన

### ఆయా గ్రామ పంచాయతీల సిబ్బందికి జీతాలు చెల్లించని వైనం

### గ్రామ పంచాయతీలలో అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్యం

తిరుపతిరూరల్, జూలై 15 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలంలో పంచాయతి కార్యదర్శులు లేకుండానే పాలన సాగుతుంది. దీంతో ఆయా గ్రామ పంచాయతిలలో పారిశుధ్యం కూడా అస్తవ్యస్తంతో తయారవడంతో పాటు పంచాయతి పాలన పూర్తిగా కుంటుపడింది. గ్రామ పంచాయతిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు, బిల్ కలెక్టర్లకు, పంపు ఆఫరేటర్లకు ఇతర సిబ్బందికి గత జూన్ నెల జీతం కూడా చెల్లించలేదు. గత జూన్ 11న పేరూరు, సాయినగర్, తిరుమలనగర్, రణధీరపురం, మంగళం గ్రామ పంచాయతి కార్యధర్శులను కలెక్టరేట్‌కు బదిలీ చేసిన విషయం తెల్సిందే. అప్పటి నుంచి ఇంటిపన్నులు చెల్లించాలన్నా...బిల్డింగ్ అప్రూవల్ కావాలన్నా, పంచాయతి సిబ్బంది జీతాలు చెల్లించాలన్నా, పంచాయతిలో పారిశుధ్యం మెరుగుపడాలన్నా, మౌళిక సదుపాయాలు కల్పించాలన్నా...ఆయా గ్రామ పంచాయతిలకు కార్యదర్శి సేవలు తప్పనిసరి. ఆయా గ్రామ పంచాయతిలలో కార్యదర్శులు లేకుండా పాలన సాగుతుంది. వర్షాకాలంలో గ్రామ పంచాయతిలలో పారిశుధ్యం మెరుగుపరచపోతే అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. తిరుపతిరూరల్ మండలంలోని అనేక గ్రామ పంచాయతిలలో డ్రైనేజ్ వ్యవస్త సరిగా లేనందున ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోయి, దోమలు స్వారవిహారం చేస్తున్నాయి. కొన్ని గ్రామ పంచాయతిలలో వందల సంఖ్యలో అపార్టుమెంట్స్ నిర్మాణాలు జరిగాయి. కానీ ఆ అపార్టుమెంట్స్‌కు డ్రైనేజ్ వ్యవస్త మాత్రం సరిగా లేదు. అపార్టుమెంట్స్ నుంచి మురుగునీరును బహిరంగ ప్రదేశాలలో వదిలేసి, చెయ్యి దులుపేసుకొంటున్నారు. దీంతో మురుగు నీటిలో పశువులు, పందులు దొర్లుతూ దోమలకు అవాసాలుగా తయారైతున్నాయి. ఇట ీవల పద్మావతిపురంలో పాస్ మనోవికాస్‌కేంద్రంలో డయోరియాకు ఇద్దరు మృతి చెందిన విషయం తెల్సిందే. ఉన్నతాధికారులు స్పందించి కార్యదర్శులు లేని పేరూరు, సాయినగర్, మంగళం, రణధీరపురం, తిరుమలనగర్ పంచాయతీలకు కార్యదర్శులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

# సమస్యల పరిష్కారంలో కలెక్టర్ కొత్త ఒరవడి

చిత్తూరు టౌన్, జులై 15 ప్రభాతవార్త:

కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కొత్త ఒరవడి సృష్టిస్తున్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమానికి సమస్యలతో వచ్చే ప్రజలను కలెక్టర్ వారి సమస్యను అడిగి తెలుసుకొని ఆ సమస్యను పరిష్కరించాల్సిన అధికారితో ప్రజలతోనే ఫోన్‌లో మాట్లాడించి సమస్యను అక్కడిక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ కార్యక్రమంలో సమస్యలు చేతపట్టుకొని వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించి పరిశీలించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆ సమస్య పరిష్కరించే అధికారితో అర్జీదారుడిని సెల్‌ఫోన్‌లో మాట్లాడించి సమస్యను పరిష్కరిస్తున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ



కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్ లు హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి విధిగా నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని, వారి శాఖల పరిధిలో వారి కింది స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నది లేనిది జిల్లా అధికారులు పరిశీలించాలన్నారు. ప్రజల అర్జీల పరిష్కారంకు తీసుకుంటున్న చర్యలపై ప్రతివారం సమీక్ష నిర్వహిస్తామన్నారు. అధికారులు ఆలసత్వంను వీడి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలన్నారు.

## ప్రజల అర్జీలను సకాలంలో పరిష్కరించాలి : జెసి ధ్యానచంద్ర

తిరుపతి కార్పొరేషన్, జులై 15, ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సకాలంలో అర్ధవంతమైన పరిష్కారం చూపాలని, అలసత్వం సహించేది లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్‌తో పాటు డిఆర్ఓ పెంచల్ కిషోర్, డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, కోదండరామిరెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. మొత్తం 131 వినతులు రావడం జరిగిందని అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని గ్రీవెన్స్‌కు హాజరైన వివిధ శాఖల అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.



# రూ.45 లక్షలు విలువైన 50 ద్విచక్రవాహనాలు రికవరీ

## - వాహనాల దొంగను పట్టుకున్న పూతలపట్టు పోలీసులు



పూతలపట్టు, జులై 15 ప్రభాతవార్త: పూతలపట్టు పోలీసులు సోమవారం 45 లక్షల రూపాయలు విలువ చేసే 50 ద్విచక్రవాహనాలను రికవరీ చేసి ద్విచక్రవాహనాల దొంగను పట్టుకొని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. పూతలపట్టు ఇన్స్‌పెక్టర్ సుదర్శన్‌ప్రసాద్ వెల్లడించిన వివరాల మేరకు పూతలపట్టు పోలీసులు ఆదివారం సాయంత్రం రంగంపేట క్రాస్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసుల తనిఖీ చూసి ఒక వ్యక్తి ద్విచక్రవాహనంలో పారిపోవడానికి ప్రయత్నించడంతో పోలీసులు అతనిని వెంబడించి పట్టుకొన్నారు. ఈ మేరకు అతనిని విచారిస్తే అతని వద్ద వాహనానికి సంబంధించి పత్రాలు లేకపోవడంతో పోలీసులు ప్రశ్నిస్తే తాను పల్సర్ వాహనంను పూతలపట్టు నుండి దొంగలించుకొని వచ్చానని నేరం ఒప్పుకొన్నాడు. ఈ మేరకు తన పేరు ముసళ్ళ సందీప్ అని తాను నెల్లూరు జిల్లా ముదివర్తివారిపల్లి గ్రామంకు చెందిన వాడని తాను తరచు ద్విచక్రవాహనాలను దొంగతనం చేస్తుంటానని నేరం ఒప్పుకున్నాడు. ఈ మేరకు తాను దొంగలించిన ద్విచక్రవాహనాలను భాకరాపేట వద్ద తాను నివసిస్తున్న నివాసం వద్ద వుంచినట్లు చెప్పడంతో పోలీసులు అక్కడికి వెళ్ళి అక్కడ అతను దొంగలించి వుంచిన ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొన్నారు. సందీప్ ద్విచక్రవాహనాలను గూడూరు, ఇందుకూరుపేట, నెల్లూరు రూరల్, భాకరాపేట, ఓజిలి, పీలేరు, తిరుపతి, పుల్లంపేట, శ్రీకాళహస్తి, పాకాల. పూతలపట్టు, కాణిపాకం ప్రాంతాల్లో దొంగతనాలు చేశాడని ఆయన వివరించారు. ఈ మేరకు సందీప్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్స్‌పెక్టర్ సుదర్శన్ ప్రసాద్ తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వేగంగా సమస్యలు పరిష్కారం : కమిషనర్ అరుణ

చిత్తూరు టౌన్, జులై 15 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి అందిన సమస్యలను పరిశీలించి వేగవంతంగా పరిష్కరించాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమీషనర్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో గత వారంలో ప్రజల నుండి సమస్యలపై వచ్చిన వినతుల పరిష్కారంపై కమీషనర్ సమీక్షించారు. ఈ వారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 8 సమస్యలపై ప్రజలు కమీషనర్‌కు వినతులు సమర్పించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్య

### - పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.మురళీమోహన్



బంగారుపాళ్యం, జులై 15 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందుతుందని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ అన్నారు. సోమవారం మధ్యాహ్నం మంగళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల నందు విద్యావాణి 27వ సంచికను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యావాప్తి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వ్యయం చేస్తోందని చెప్పారు. ప్రతి విద్యార్థి చక్కగా చదువుకోవాలని సూచించారు. జడ్పీ పాఠశాల నందు చదువుకున్న విద్యార్థులచే నిర్వహిస్తున్న విద్యావాణి పలువురు విద్యార్థులకు ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు అరుణ శివప్రసాద్, ఎంఇఒలు నాగేశ్వరరావు, రమేష్, గ్రామ సర్పంచ్ మురళీ, దేశం నాయకులు జనార్ధన్‌గౌడు, మహేంద్ర, మోహన్‌నాయుడు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిడినెల్లూరులో కార్ల విడిభాగాల తయారీ పరిశ్రమ

### - ఎమ్మెల్యే డాక్టర్ థామస్



పాలసముద్రం, జులై 15 ప్రభాతవార్త: జిడినెల్లూరు నియోజకవర్గానికి పలు పరిశ్రమలు తీసుకువచ్చి జిడినెల్లూరును పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పేర్కొన్నారు. జిడినెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను పుత్తూరులో సోమవారం కొరియా దేశంకు చెందిన కెవిి గ్లోబర్ వెంచర్ సంస్థ సిఇఒ యంగ్‌డేనౌ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ కెవిి గ్లోబల్ వెంచర్ సంస్థ జిడినెల్లూరు నియోజకవర్గంలో కార్ల విడిభాగాల తయారీ పరిశ్రమ స్థాపించడానికి ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. జిడినెల్లూరు నియోజకవర్గంలో మరిన్ని పరిశ్రమలు తీసుకువచ్చి ఇక్కడి యువతకు ఉపాధి కల్పించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పేర్కొన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంను మరో శ్రీసిటీ చేయడానికి తన శ్రమిస్తానని ఇందుకోసం ప్రజలందరి సహకారం అవసరని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరికొంత పారిశ్రామిక వేత్తలతో మాట్లాడి గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## కెఇసి అధ్వర్యంలో ఘనంగా వనమహోత్సవం

కుప్పం, జులై 15 ప్రభాతవార్త




కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ విభాగం అధ్వర్యంలో కొత్తపేట జడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఘనంగా వన మహోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు మాధవన్, గంగాధర్, హెచ్ఎం గురుప్రసాద్ నాయుడు, ఉపాధ్యాయులు శివాచారి, కోదండ రామిరెడ్డి, పిఆర్వో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### -పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల, జులై 15 ప్రభాతవార్త: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పూలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. సోమవారం ఐరాల ప్రాథమిక పాఠశాలలో మేదరమిట్ట శంకర్‌నాయుడు పార్వతమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని 5,500 మంది విద్యార్థులకు విరాళంగా ఇచ్చిన నోట్ పుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. దాతలు అందిస్తున్న సహకారంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమం లో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లారపల్లి గిరిధర్‌నాయుడు, దాత సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మేదరమిట్ట మోహన్‌నాయుడు, మాజీ జడ్పీటీసీ ఎం.లత, క్లస్టర్ ఇన్‌చార్జి మురళి, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, సీనియర్ నాయకులు హేమాద్రినాయుడు, మండల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం

### - ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, జులై 15 ప్రభాతవార్త



విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు తొలగించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని తమ తల్లిదం డ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఏదేని సమస్యలు ఉ ంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పేద పిల్లల చదువులకు తమవ ంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సిఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు ముున్ముందు ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతో పాటు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు చేపడ్తారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, పిసి ఛైర్మన్ సరిత, హెచ్ఎం నటరాజురెడ్డి, నేతలు జనార్ధనరెడ్డి, చంద్ర, మణి, నాగరాజు, అనసూయ, బాబు, బాలు, సుగుణమ్మ, శ్యామలమ్మ, రూప తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ

తవణంపల్లె, జులై 15 ప్రభాతవార్త: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం మండలం విద్యాశాఖ ద్వారా విద్యాసామాగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈమేరకు మండల విద్యాశాఖాధికారి త్యాగరాజులురెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. మండలంలోని 66 పాఠశాలల్లో చదువుతున్న 1262 మంది బాలురు, 1240 మంది బాలికలకు యూనిఫాం, షూష్,బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్గినేటర్ సృజనకుమారి,సీఆర్పీలు, మెసెంజర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ..

పెద్దపంజాణి జులై 15 ప్రభాతవార్త : మండలంలోని రాజుపల్లి ప్రభుత్వపాఠశాల విద్యార్థులకు సోమవారం రాజుపల్లి టీడీపీ అధ్యక్షుడు బాలక్రిష్ణా రెడ్డి,పాఠశాల ఛైర్మన్ శేఖర్‌రెడ్డిలు విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. .విద్యార్థులు బాగా కష్టపడిచదివి ఉన్నతస్తాయికి ఎదగాలని సూచించారు. రాజుపల్లి టీడీపీ నాయకులు జయపాల్ రెడ్డి,నంద గోపాల్ రెడ్డి,రాజశేఖర్ రెడ్డి,రాజా గౌడు,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీనివాస శంకర్ నేత్రాలయ పున:ప్రారంభానికి చైతన్య కృషి అభినందనీయం

కాణిపాకం, జులై 15 ప్రభాతవార్త: రాజకీయ కారణాలతో గత ప్రభుత్వం నిలిపి వేసిన శ్రీనివాస శంకర్ నేత్రాలయంను పున:ప్రారంభించడానికి జనసేన యువ నాయకులు డికె.చైతన్య కృషి అభినందనీయమని జిల్లా జనసేన నాయకులు ఎం.మహేష్‌స్వారో తెలిపారు. సేవా దృక్పథంతో కూడిన శ్రీనివాస శంకర నేత్రాలయ సంస్థ సేవలను తిరిగి ప్రారంభించాలనుకోవడం సంతోషకర విషయమన్నారు. ఎన్నో లక్షల మందికి కంటి చూపు ప్రసాదించిన ఈసంస్థ పున: ప్రారంభానికి ప్రత్యేక శ్రద్ద చూపుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలసి చర్చించడం శుభపరిణామన్నారు. త్వరలో శ్రీనివాస శంకర నేత్రాలయ సంస్థను పున:ప్రారంభించి తన అద్భుత సేవలను లక్షలాది మందికి అందించాలని ఆయన ఆకాంక్షించారు.

## శివానందపురానికి ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

కుప్పంరూరల్, జులై 15 ప్రభాతవార్త



మండలంలోని తమిళనాడు సరిహద్దు గ్రామాలైన అడవిబూదుగూరు - శివానందపురం వయా యానాదిపల్లి మీదుగా నూతన ఆర్టీసీ సర్వీసును తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గతంలో ఆగిపోయిన ఆర్టీసీ సర్వీసులను విడతల వారీగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వైకాపా పాలనలో కుప్పం డిపోకు చెందిన బస్సులను పుంగనూరు, ఇతర ప్రాంతాలకు తరలించి ప్రజలకు ఇబ్బందులు కలిగించారన్నారు. సిఎం చంద్రబాబు బాధ్యతలు చేపట్టగానే ఇక్కడి బస్సులన్నీ మరలా వెనక్కువస్తున్నాయన్నారు. అ ంతకుముందు బస్సుకు పూజ నిర్వహించారు. గ్రామస్తులు సిఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో నేతలు సాంబశివం, రామచంద్ర, సత్యేంద్రశేఖర్, చిట్టిబాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలి



చౌడేపల్లి, జులై 15 ప్రభాతవార్త మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు పయనించేలా అధికారులు సహకరించాలని తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి (చిట్టి) అన్నారు. నియోజకవర్గ తేదేపా బాధ్యుడు చల్లా రామచంద్రారెడ్డి(బాబు) ఆదేశాల మేరకు ఆయన సోమవారం స్థానిక మండల పరిపాలనా భవనంలో అధికారులతో శాఖల పనీతీరును సమీక్షించారు. ముఖ్యంగా గృహనిర్మాణంలో పేద, బడుగులకు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ప్రలకు అందుబాటులో వుండి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు. పంజానిపల్లి బాబునాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, సోషియల్ మీడియా ప్రతినిధి కళ్యాణ్, తేదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అధికారులతో సమీక్షా సమావేశం



చిల్లకూరు, జులై 15, ప్రభాతవార్త చిల్లకూరు గ్రామంలోని ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీ నివాసంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌తో కలిసి నియోజకవర్గ పరిధిలోని ఆర్అండ్ బి అధికారులు, ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారఉలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా, ప్రజలు ఇబ్బంది పడకుండా చెరువులకు ఆనకట్ట మరమ్మత్తులు, ఫ్లడ్ బ్యాంక్స్, రోడ్డు రిపేర్లకు సంబంధించి ప్రపోసల్స్ తయారు చేయించి తీసుకువస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించుకుని వస్తానని సమావేశంలో పేర్కొన్నారు.

## ఓటు వజ్రాయుధం లాంటిది : ఏజిఎం గురవయ్య



వెంకటగిరి ,జులై 15, ప్రభాతవవార్త ఓటు వజ్రాయుధం లాంటిదని నారాయణ విద్యాసంస్థల ఏజిఎం గురవయ్య తెలిపారు. వెంకటగిరిలోని నారాయణ పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదో తరగతి వరకు విద్యార్థులకు పోలింగ్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి నాయకున్ని ఎన్నుకునేందుకు ప్రజాస్వామ్యం ఓటు హక్కు కల్పించిందని తెలిపారు. ఓటు హక్కు గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్స్, ఈవీఎం యంత్రాలపై కూడా విద్యార్థులకు ప్రిన్సిపాల్ కిరణ్ వివరించారు. విద్యార్థులకు పోలింగ్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

## డివిసత్రంలో ఎమ్మెల్యే విజయోత్సవ ర్యాలీ ...

దొరవారిసత్రం జులై 15 ప్రభాతవార త్;



సార్వత్రిక ఎన్నికల్లో సూళ్ళూరుపేట తొలిమహిళ ఎమ్మెల్యేగా 29150ఓట్లు మెజార్టీతో గెలుపొందిన నెలవల విజయశ్రీకి దొరవారిసత్రం మండలపార్టీ అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు ఆద్వర్యంలో సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురు నాయకులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని పాలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.దొరవారిసత్రం నుండి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లడుతూ సూళ్ళూరుపేట నియోజకవర్గాన్ని అన్ని విదాల అబివృద్ధి చేసేవిదంగా కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి నెలవల సుబ్రమణ్యం,జిల్లాపార్టీ అధ్యక్షుడు నర్సింహయాదవ్,నాయకులు గోను జకరయ్య,ప్రసాద్‌నాయుడు, ఉదయ్‌కుమార్,మల్లి మురళి, బాబునాయుడు, కిషోర్‌నాయుడు, అమరజీవి, తదితరులు ఉన్నారు.

## పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా పై సమగ్ర విచారణ జరపాలి

గూడూరు, జులై 15, ప్రభాతవార్త ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమ రవాణా పై సమగ్ర విచారణ చేపట్టాలని నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు కోరారు. గూడూరు జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలో మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలను చర్చించడంతో పాటుగా పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా పై జనసేన పార్టీ నాయకులు పలు సమాచారం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు కేంద్రంగా గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా చెన్నైకు రేషన్ బియ్యం యాధేచ్చగా తరలిందని అందుకు పలు శాఖల అధికారులు సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాలో సూత్రదారులైన స్మగ్లర్లు, అధికారుల గుట్టు రట్టు కావాలంటే సమగ్ర విచారణ జరగాలని అందుకు సంబంధించి ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు నాగార్జున ,సాయి కిరణ్, వేణు, సుమన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించ వద్దంటూ ఆందోళన



కోట, జులై 15 ప్రభాతవార్త కోట మండలం జరుగుమల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటకృష్ణయ్యను తొలగించ వద్దంటూ సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు ఆందోళన చేశారు. ఎన్నో సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న వెంకటకృష్ణయ్యను తొలగించాలని ప్రయత్నాలు చేయడం మానుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏపీఓ పూర్ణిమ మాట్లాడుతూ ప్రతిపాదనలు పంపామని, మండలంలోని ఏ ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించలేదని చెప్పారు.

## అతిసార నివారణపై అవగాహన

కోట, జులై 15 ప్రభాతవార్త కోట మండలంలోని చిట్టేడు ఎస్సీ గురుకుల పాఠశాలలో సోమవారం చిట్టేడు ఆరోగ్య ఉపకేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగరాజు అతిసార నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు కాచిన వేడినీళ్లు తాగాలని సూచించారు. బయట తినుబండారాలను తినవద్దని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అదేవిధంగా హాస్టల్‌లో వంటలు, కూరలపై ఖచ్చితంగా మూత ఉండే పాత్రలు వేయాలని సూచించారు. ఈగలు ఎక్కడంటే అక్కడ పదార్థాలపై వాలితే ప్రమాదకరమని చెప్పారు. విద్యార్థులు చేతులను సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు.

## నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయం

కోట, జులై 15 ప్రభాతవార్త దివంగత పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం జ్యోతి డే సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఒకనాడు పూరిగుడిసెలో రాత్రి పాఠశాలతో ప్రారంభమై అంచలంచెలుగా ఎదిగి అనేక కళాశాలలుగా ఏర్పడ్డాయని చెప్పారు. వేలాదిమందికి ఉచిత విద్య అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నాడు భారత ప్రభుత్వం బాలకృష్ణారెడ్డి సేవలను గుర్తించి పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసిందని గుర్తు చేశారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో పిఎం, సిఎం చిత్రపటాలు



కోట, జులై 15 ప్రభాతవార్త కోటలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం జనసేన పార్టీ నాయకులు అల్లం బాబు దాతృత్వంతో ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలను బహూకరించారు. జనసేన నాయకులు అల్లం బాబు మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అధినాయకుల చిత్రపటాలను కార్యాలయాల్లో ఉంచాలనే ఉద్దేశ్యంతో తాను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గూడూరు నియోజకవర్గం అధికార ప్రతినిధి డాక్టర్ తిరుమలశెట్టి కోటేశ్వరరావు, పిడబ్ల్యుడి ఫెడరేషన్ కోట మండల అధ్యక్షుడు గూడూరు కృష్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థులకు కిలివేటి పరామర్శ



నాయుడుపేట టౌన్, జులై 15 ప్రభాతవార్త నాయుడుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కావడంతో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. నాయుడుపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. సమాచారం అందిన వెంటనే ఆయన నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. గురుకులంలోని హాస్టల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్లక్ష్యానికి కారకులైన వారిని గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తేవాలి

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు




గూడూరు, జులై 15, ప్రభాతవార్త ఇసుకను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇసుకను అధిక ధరలతో విక్రయించి సామాన్య ప్రజల పై భారం మోపిందన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుకను ఇస్తానని, నేడు రవాణా, మైయిటెన్స్ చార్జీల పేరుతో ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఏద్దేవా చేశారు. ఇసుక వలన భవన నిర్మాణ రంగం దెబ్బతిని పోయిందన్నారు, ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ రంగం నాయకులు పుట్టా శంకరయ్య, గూడూరు సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, సిఐటియు డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్, అడపాల ప్రసాద్, ఆటో యూనియన్ నాయకులు బివి రమణయ్య, బి. చంద్రయ్య, మధు, తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులకు హెల్మెట్ ప్రయోజనాలపై అవగాహన

గూడూరు, జులై 15, ప్రభాతవార్త హెల్మట్ ధరించండి ప్రాణాలను కాపాడుకోండని జూనియర్ సివిల్ జడ్జి లోకనాథం పేర్కొన్నారు. సోమవారం గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు ప్రాంతంలో వాహనదారులకు హెల్మెట్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనంపై ప్రయాణం చేసేటప్పుడు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుండి బయటపడేందుకు హెల్మెట్ ఏ విధంగా ఉపయోగపడేందుకు హెల్మెట్ ఏ విధంగా ఉపయోగపడుతుందో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం

### శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ఆలూరి రాజేంద్రప్రసాద్




వెంకటగిరి, జులై 15, ప్రభాతవార్త మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడు కోవాలని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ఆలూరి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని రాజా వీధిలో ఉన్న శ్రీ చైతన్య పాటశాలలో గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా చెట్లు నాటే కార్యక్రమం ప్రిన్సిపాల్ ఆలూరి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బంగారుపేట పిహెచ్‌సి డాక్టర్ శివకృష్ణ రెడ్డి పాల్గొన్నారు. చిన్నారులు పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటితే అవి పెరిగే కొద్ది పిల్లలు కూడా పెరుగుతుంటారని గుర్తుగా ఉంటాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ చంద్రశేఖర్, ప్రైమరీ ఇంచార్జి దివ్య, ప్రీ ప్రైమరీ ఇంచార్జి శ్రీ లక్ష్మి, హై స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచండి ...ఎమ్మెల్యే



దొరవారిసత్రం జులై 15 ప్రభాతవార్త ; గ్రామాల్లో వర్షాలు కురుస్తుడటంతో పంచాయితీ పాలకులు అధికారులు పారిశుద్ధ్యం మెరుగు పరిచేవిదంగా చర్యలు చేపట్టాలని సూళ్ళూరుపేట శాసనసభ్యులు నెలవల విజయశ్రీ అధికారులను కోరారు.ఆమె సోమవారం సాయంత్రం దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఎమ్మెలే య నెలవల విజయశ్రీ మాట్లడుతూ వర్షాకాలం కావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాదులు ప్రబలకుండా వైద్యఆరోగ్యశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు ఆరోగ్యంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఉపాదిహామీ పథకం ద్వార గ్రామాల్లో ప్రతిఒక్కరికి వందరోజులు పనిదినాలు కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లాతెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు నరసింహయాదవ్,నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం, మండలపార్టీ అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులునాయుడు,ఎంపిపి దువ్వూరు సుజాతమ్మ,అదికారులు మనోజ్,ఎవో జ్యోతి,ఎంపిడిఓ,తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

# సంఘటన స్థలానికి పరుగులు తీసిన అధికారులు

శ్రీకాళహస్తి,జూలై 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు-వెంకటగిరి రహదారిలోని అముదూరు వద్ద ఆదివారం రాత్రి జరిగిన లారీ దూసుకెళ్ళిన సంఘటనలో తల్లిబిడ్డ మృతి చెందిన సంఘటన తెలిసిందే. సోమవారం ఉదయం మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి స్పందించారు.రిజినల్ అధికారి జెటిసి బసిరెడ్డి, శ్రీకాళహస్తి మోటారువాహన తనిఖీ అధికారి దామోదర్‌నాయుడు సంఘటనా స్తలానికి పరుగులు తీసారు. సమగ్రంగా పరిశీలించారు.తరువాత మీడియాతో బసిరెడ్డి మాట్లాడుతూ డ్రైవర్ అతివేగంగా వాహనం నడపటంతోనే ప్రమాదం జరిగినట్లు నిర్ధారించారు.నిర్లక్ష్యంగా వాహనం నడపటం రోడ్డు కుడిపైపు నిలబడి ఉన్న వారిపై దూసుకెళ్ళిందని వివరించారు.శ్రీకాళహస్తి ఎంవి ఇన్స్పెక్టర్ దామోదర్‌నాయుడు మాట్లాడుతూ అతివేగంగా వాహనాలు నడపటం,రహదారి నియమాలు


అముదూరులో పరిశీలిస్తున్న అధికారులు

పాటించక పోతే ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు స్పందించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ మీద నిర్లక్ష్యంతో ఆదివారం రాత్రి అముదూరు వద్ద ప్రమాదం జరిగి ఓ చిన్నారి మృత్యువు ఒడిలో వాలిందని ఓ బిడ్డ తల్లి ని కొల్పోయాడని వివరించారు. కాగా ఏర్పేడు సిఐ శ్రీరామ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ లారీ డ్రైవర్ బహుశా ఎక్కువ సమయం డ్రైవింగ్ చేయటంతో నిద్రలోకి జారడేమో అని అభిప్రాయం వ్యక్తం చేసారు.మద్యం సేవించారా? అని వైద్యపరీక్షలు జరిపించామన్నారు. ఈ ప్రమాదంలో రామానుజపల్లికి చెందిన శారద(22),వైష్ణవి(2) మృతి చెందగా కార్తీక్ శ్రీకాళహస్తిలోని ప్రభుత్వాసుపత్రిలో ప్రాధమిక చికిత్స జరిపి అక్కడే ఉన్న ఎంజిఎం ఆసుపత్రిలో మెరుగైన చికిత్స కోసం చేర్పించినట్లు వివరించారు. కేసు విచారణ జరుగుతుందన్నారు.

## లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితేనే విజయం సాధ్యం



తొట్టంబేడు, జూలై 15 ప్రభాతవార్త : లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితేనే విజయతీరాలకు చేరుకోవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు.సోమవారం పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న సరస్వతీబాయి పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో 2023-24సంవత్సరంలో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సుబ్బమ్మ మరియు మోహనరావు ఫౌండేషన్ ద్వారా బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఎంఎల్ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డి, మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, ఎంఈవో భువనేశ్వరిలు హాజరవగా సుబ్బమ్మ మరియు మోహనరావు ఫౌండేషన్ నిర్వాహకులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మోహన్‌రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు మాట్లాడుతూ ఉన్నత స్థానాలకు చేరుకునే బాధ్యత ప్రతి విద్యార్థిని, విద్యార్థులపై ఉందని తెలిపారు. విద్యపై దృష్టిసారించాలని అప్పుడే ఏకాగ్రత సాధ్యమవుతుందన్నారు. ఉపాధ్యాయులు కూడా ఎప్పటికప్పుడు విద్యార్థుల మేధాశక్తిని పరిశీలించాలని కోరారు. అనంతరం ఎంఎల్ఏ సతీమణి బొజ్జల రిషితారెడ్డి మాట్లాడుతూ విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చన్నారు. తల్లిదండ్రులు ఆకాంక్షలు నెరవేర్చడంలో విద్యార్థులు ముందుండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. నేడు బాలికలే అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే విజయం సాధించవచ్చన్నారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి ఓవైపు కార్పొరేట్, మరో వైపు ప్రైవేటు పాఠశాలల్లో వేలాది ఫీజులు చెల్లించి చదివిస్తున్నారని అయితే నాణ్యమైన విద్య కావాలంటే ఒక్క ప్రభుత్వ పాఠశాలలకే సాధ్యమన్నారు. అనంతరం 10కి10 జిపిఎ సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు మెమొంటోతో పాటు మెడల్స్‌ను అందించి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బృందాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రికి శివయ్య ప్రసాదాలు



శ్రీకాళహస్తి, జూలై 15 ప్రభాతవార్త : వెలగపూడి సచివాలయంలో జరిగిన గిరిజనుల రాష్ట్ర అధ్యక్షులు, పార్లమెంటు అధ్యక్షులు నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి శ్రీకాళహస్తి నుంచి తిరుపతి పార్లమెంటు ఎస్‌టి సెల్ అధ్యక్షుడు ఎం.సుబ్బయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొని గిరిజనులకు విద్య, వైద్య, మౌళిక వసతుల విషయంలో రాజీపడే ప్రసక్తిలేదని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం మంత్రికి శివయ్య తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు.

## డయేరియాపై విద్యార్థులకు అవగాహన



తొట్టంబేడు, జూలై 15 ప్రభాతవార్త : మండలంలోని దిగువసాంబయ్యపాళెం ప్రాధమిక పాఠశాలలో విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు అతిసారం, చేతి శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్‌సూపర్‌వైజర్ నాగేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు, గ్రామస్తులు చేతివేళ్ళను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలవిసర్జనను బహిర్భూమికి వెళ్ళరాదని, కలుషితమైన ఆహార పదార్థాలు, తాగునీరు వాడరాదని తెలిపారు అతిసారం పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలసుబ్రమణ్యం, ఎఎన్ఎం ఇందిరమ్మ, ఆశావర్కర్ దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్త మోహనరాణి గ్రామస్తులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిక్షణ మొక్కలతోనే సాధ్యం



శ్రీకాళహస్తి, జూలై 15 ప్రభాతవార్త : పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తిలో భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఆర్‌సిపి ఇంగ్లీష్‌మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో పరిసరాలను శుభ్రపరచి, మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుప్రజల, రోవర్‌లీడర్ విద్యాసాగర్, చంద్ర, కోదండరామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## వసతిగృహాలను తనిఖీ చేసిన అధికారులు



శ్రీకాళహస్తి, జూలై 15 ప్రభాతవార్త : పట్టణంలోని బిసి, ఎస్‌సి వసతి గృహాలను సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు కమిషనర్ రమేష్‌బాబు సూచనలతో పురపాలక సంఘ డిఈఈ ఆర్.లలిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. వసతిగృహాల్లో పరిసరాల పరిశుభ్రతతో పాటు మంచినీటి వసతికి సంబందించి పరిశీలించారు. అనంతరం మంచి నీటి బోరు శాంపిల్స్‌ను సేకరించి పరిశీలనకు పంపారు. తనిఖీ కార్యక్రమంలో పిహెచ్ మేస్త్రీ శ్రీకాంత్, ఉదయ్, సచివాలయ సిబ్బంది చైతన్యలు పాల్గొన్నారు.

## పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



శ్రీకాళహస్తిరూరల్,జూలై 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలంలోని రామాపురం రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన ధ్యాన శివుడు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులను ఆకట్టుకుంటుంది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు కైలాసగిరి పర్వత పంక్తుల్లో వెలసిన అంజూరు వారి మండపం సమీపంలో తిరుపతి పట్టణానికి మంచినీటిని అందించే మంచినీటి రిజర్వాయర్‌ను నిర్మించారు. ఇది గిరి ప్రదక్షిణం సందర్భంగా భక్తుల్ని ఇట్టే ఆకట్టుకుంటుంది.ఈ నేపథ్యంలో ఇక్కడ భక్తుల్ని ఆటక్టుకునే రీతిలో ధ్యాన శివుని ఏర్పాటు చేసారు. ఓ వైపు జలాశయం నిండా నీరు,ఎదురుగా ధ్యాన శివుడు వెలయటంతో భక్తులు జలకాలాడి ధ్యాన శివుని దర్శించుకొని పూజిస్తున్నారు. సమీపంలోని వేయి లింగాల కోనలో వెలసిన సహస్రలింగేశ్వరుని దర్శనానికి వెళుతున్నారు. కైలాసగిరుల్లో చక్కగా సిమెంటు రోడ్డు నిర్మించటం పక్కన చెట్లు నాటటంతో పౌర్ణమి సందర్భంగా ప్రతి నెల కాలినడకన అలాగే దేవస్థానం బస్సులో భక్తులు ప్రదక్షిణలు చేస్తున్నారు. మండలంలోని కైలాసగిరుల్లో శక్తి అమ్మవారు దక్షిణ కాళిమాతగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తుంది. కాగా ఇక్కడే కాలభైరవ ఆలయం వెలసింది. ఇక్కడ స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతాలకు ప్రతి రోజూ దేవస్థానం ఉచిత బస్సును నడిపితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు పరిశీలకులు చెబుతున్నారు. ఆధ్యాత్మిక చింతన పట్ల అవగాహన ఉన్న శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి చొరవ చూపితే ఉచిత బస్సుతో ఈ ప్రాంతాలు పర్యాటకంగా అభివృద్ధి చెందుతాయి.

## ఏపి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్మదిన వేడుకలు



తిరుపతి హెల్త్, జూలై 15, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు జన్మదిన సందర్భంగా ఏపి బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరి నాగరాజ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం రుయా ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి పైగా అన్నదానం చేసారు. నిరంతరం బీసీల సంక్షేమానికి కృషి చేస్తున్న తమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు మరెన్నో జన్మదిన వేడుకకులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్, నాయకులు మధు ఆచారి, అలం బాబు గౌడ్, సుబ్రమణ్యం, జగదీష్, నాగేంద్ర, మహేష్, మురళి పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



తిరుపతి హెల్త్, జూలై 15 ప్రభాతవార్త : స్విమ్స్ - కమ్యూనిటీ శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ మండలం, వెంకటపతి నగర్ గ్రామ పంచాయతీలో ప్రత్యేకించి వైద్య శిబిరాన్ని సోమవారం ఉచిత వైద్య శిబిరంను నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని చంద్రగిరి శాసన సభ్యులు శ్రీ పులివర్తి వెంకటమని ప్రసాద్, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. ఉషాకళావత్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. నాగరాజు, వెంకటపతి, నగర సర్పంచ్ వై. సుబ్రమణ్యం సంయుక్తంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిధిగా హాజరైన చంద్రగిరి శాసన సభ్యులు పులివర్తి నాని మాట్లాడుతూ ఈ వైద్య శిబిరానికి విచ్చేసిన స్విమ్స్ వారు వెంకటపతి నగర్‌లోని ప్రతి ఇంటికి వెళ్లి వారి యొక్క ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకుని, తద్వారా ఎవరికైన ఎటువంటి ఆరోగ్య సమస్యలున్నా వారిని స్విమ్స్ హాస్పిటల్‌కి పంపిచడం జరుగుతుందని తెలిపారు. ఈ వైద్య శిభిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం స్విమ్స్ డైరెక్టర్ వైస్ చాన్సెలర్ డా. ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ వెంకటపతి నగర్‌లో స్విమ్స్ ద్వారా ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా వుండాలని స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. మెడికల్ క్యాంపులో భాగంగా వెంకటపతి నగర్‌లో దాదాపు 100 మందికి రక్తపరీక్షలు చేసి హిమోగ్లోబిన్, బిపి, షుగర్ వ్యాధి పరీక్షలు, మూత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ ఎస్‌పిఎంసిడబ్ల్యూ వైద్యులు, స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగపు వైద్యులు డా. అంజు, ఒడా. సుజిత్ కుమార్, డా. రవిశంకర్, డా. విశ్వేశ్వర రావు, డా. ప్రత్యూష, డా. లలిత్, డా. ఐశ్వర్య, ఇతర స్విమ్స్ వైద్యులు దామినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డా. నీలిమ, డా. ఉదయశ్రీ, స్థానిక సర్పంచ్ చిన్ని యాదవ్, గ్రామ సచివాలయ సిబ్బంది, స్విమ్స్ ఎంబిబిఎస్ విద్యార్థినులు, టెక్నీషియన్లు, స్విమ్స్ ఏడి వి. రాజశేఖర్, ఎంఎస్‌డబ్ల్యూ ప్రసాద్ రెడ్డి, స్విమ్స్ సిబ్బంది, స్థానిక నాయకులు, వెంకటపతి నగర్ సబ్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి నాయకుడు డాబా ధ్వంసం!

### -మాజీ ఎంఎల్ఏ సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పరామర్శ



చంద్రగిరి, జూలై 15 ప్రభాతవార్త: అనంతగుర్రప్పగారిపల్లికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మేడసాని ప్రవీణ్‌కుమార్ డాబాను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి కూల్చిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. బాధితుడి కథనం మేరకు.. మదనపల్లి-తిరుపతి జాతీయ రహదారి నాగయ్యగారి పల్లి సమీపంలో ప్రవీణ్‌కుమార్ సుమారు పాతిక లక్షలు వ్యయంతో డాబా ప్రారంభించుకుని జీవనం సాగిస్తున్నాడు. విజయవాడలో అనారోగ్యంతో భాధపడుతున్న తన కుమార్తె వద్దకు వెళ్ళి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని దుండగులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు వాపోయాడు. ఆదివారం అర్ధరాత్రి వేళ ముఖాలకు మంకీ క్యాప్‌లు ధరించి వచ్చిన దుండగులు వంట మాస్టర్లపై భౌతికదాడులకు పాల్పడ్డారు. జెసిబి సాయంతో డాబా గోడలను, రేకులను కూల్చి వేశారు. సిసి ఫుటేజీ కెమెరాలను ధ్వంసం చేసి హర్డ్ డిస్క్‌లను తీసుకెళ్ళినట్లు వాపోయాడు. బ్రతుకుదెరువు కోసం భూమిని లీజుకు తీసుకుని ఏర్పాటు చేసుకున్న డాబా కూల్చివేతకు గురికావడంతో కన్నీటిపర్యంతమయ్యాడు. సమాచారం అందుకున్న మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, చెవిరెడ్డి సోదరుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డి ఇక్కడికి చేరుకుని బాధితుడిని పరామర్శించి, సంఘటనపై వివరాలను అడిగితెలుసుకున్నారు. ఈ క్రమంలో రాజకీయ కక్షతో టిడిపికి చెందిన వాళ్ళు తన డాబాను కూల్చివేసినట్లు వివరించాడు. అయితే సాయంత్రానికి ప్రవీణ్‌కుమార్ మీడియా ముందుకు వచ్చి తన డాబా కూల్చివేతకు ఎంఎల్ఏ పులివర్తి నానికి, టిడిపి కార్యకర్తలకు ఎటువంటి సంబంధం లేదని అన్నాడు. తనకు గిట్టని శత్రువులు ఎవరో ఈ కూల్చివేతకు పాల్పడినట్లు తెలిపాడు. తాను చేసిన ఆరోపణలకు ఎంఎల్ఏకి క్షమాపణలు తెలియజేసుకుంటున్నట్లు వివరించాడు.

## దామినేడు ఇందిరమ్మ ఇండ్లను సందర్శించిన ఎమ్మెల్యే



తిరుపతిరూరల్, జూలై 15 ప్రభాతవార్త: దామినేడు ఇందిరమ్మ కాలనీలో పారిశుధ్యం అధ్వన్నంగా ఉందని, త్రాగునీరు కలుషితంపై ఎమ్మెల్యే పులివర్తి నాని మండిపడ్డారు. సోమవారం దామినేడు ఇందిర మ్మ కాలనీలో ఎమ్మెల్యే నాని పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ పేదలు నివసించే దామినేడు గృహ సముదాయాల వద్ద పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందని, పేదలు త్రాగే నీరు కూడా కలుషితమై ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. దామినేడు గృహ సముదాయాల వద్ద పారిశుధ్యం మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. త్రాగునీరు కలుషితం కాకుండా మరమ్మత్తు చేయాలని సూచించారు. వర్షాకాలంలో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండి, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రమేష్‌బాబు, తహశీల్థార్ తదితరులు పాల్గొన్నారు.

## మంగళంలో స్కూల్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

తిరుపతిరూరల్, జూలై 15 ప్రభాతవార్త: విద్యాభివృద్దే దేశ అభివృద్ధికి సూచిక అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సోమవారం మంగళం ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ఎమ్మెల్యే నాని ప్రారంభించారు. అలాగే పదిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించి, ప్రోత్సాహక బహుమతులను అందజేసారు. అనంతరం ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లు చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ద పెట్టనున్నారని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో పాఠశాలకు అవసరమైన మౌళిక సదుపాయాలు గుర్తించి, పరిష్కరించటానికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్‌డిఎ కూటమి ప్రకటించిన మేనిపెస్టో సూపర్ సిక్స్ పథకాలను నియోజకవర్గంలో అభివృద్ధి చేసి, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, గోపి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిగోరాలో దుర్గాబాయి జయంతి



తిరుపతిహెల్త్, జూలై 15 ప్రభాతవార్త: ప్రముఖ సంఘసంస్కర్త, పద్మవిభూషణ్ దుర్గాబాయిదేశ్‌ముఖ్ జయంతిని సోమవారం చిగోరా కార్యాలయంలో జరుపుకున్నారు. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, చిగోరా అధ్యక్షుడు శేషగిరిరావు, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సుబ్రమణ్యంరెడ్డి తదితరుల పాల్గొని దుర్గాబాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## ఘనంగా వరల్డ్ యూత్ స్కిల్స్ డే



తిరుపతి విద్య, జూలై 15 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వరల్డ్ యూత్ స్కిల్స్ డే పురస్కరించుకొని జిల్లాలోని ఎస్‌డిహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా ప్రభావతి, పిడిడిఆర్‌డిఎ, కన్వీనర్ స్కిల్ కమిటి, మురళీకృష్ణ, సిఈఓ సెట్విన్, డివిఎస్ చక్రవర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో యువత తమ నైపుణ్యాలని మెరుగు పరుచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించలని, డిఆర్డిఏ, సీడాప్, న్యాక్ ద్వారా అందిస్తున్నటువంటి నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాల్ని అందిపుచ్చుకోవాలని ఆమె తెలిపారు. భారత దేశంలోని యువతకు మంచి నైపుణ్యాలు ఉన్నాయని ప్రపంచం అంతా భారత యువత వైపు చూస్తున్నారని రానున్న రోజుల్లో యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందంటూ తెలిపారు. అనంతరం చక్రవర్తి మాట్లాడుతూ తమ కళాశాల నందు వరల్డ్ యూత్ స్కిల్స్ డేను నిర్వహించడం చాలా సంతోషం అని తమ సంస్థ నందు ఎంప్లాయాబిలిటీ స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉచితంగా నైపుణ్య శిక్షణను కూడా ఇవ్వడం జరుగుతాయని తెలిపారు. అలాగే ఎంఎన్‌సి కంపెనీలకి అవసరమైనటువంటి స్కిల్స్‌ను కూడా నైపుణ్యఅభివృద్ధి సంస్థ ద్వారా స్కిల్స్ నేర్పించి ఎంఎన్‌సి డ్రైవర్స్‌కి తీసుకెళ్లడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్. లోకనాధం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి, తిరుపతి జిల్లా వారి సిబ్బంది మురళి, సునీష, దిల్లీప్, గణేష్, సుకన్య, యువత పాల్గొన్నారు.

## దివ్యాంగులను ప్రేమతో ఆదరించండి

### టిడిపి సీనియర్ నాయకుడు వసంత కుమార్

రామచంద్రాపురం, జూలై 15 ప్రభాతవార్త: దివ్యాంగులను ప్రేమతో ఆధరించాలని టిడిపి సీనియర్ నాయకుడు వసంతకుమార్ అన్నారు. సోమవారం మాజీ జడ్పీటిసి దేవానందం నాయుడు జన్మదిన వేడుకలను అక్షయ క్షేత్రంలో దివ్యాంగుల నడుమ నిర్వహించారు. కేక్ కట్‌చేసి దివ్యాంగులకు పంచిపెట్టారు. అనంతరం అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అబ్బూరి గిరీష్, గరుడాద్రి నాయుడు, కందుల బాబు నాయుడు, ధనంజయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం

తిరుపతి విద్య, జూలై 15 ప్రభాతవార్త : ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవ సందర్భంగా సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ప్రైజెస్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని దీన దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ప్రోగ్రాం ద్వారా శిక్షణ పొంది వివిధ రకాల కంపెనీల యందు ఉద్యోగాలు చేస్తున్న యువతను సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎం. సరిత రెడ్డి మాట్లాడుతూ డిడియుజికెవై ద్వారా రీటైల్ రంగంలో ఉచిత నైపుణ్య శిక్షణ పొంది తిరుపతిలోని భీమా జ్యువెలర్స్ పాంటలూన్స్ కంపెనీల నందు ఉపాధి పొందిన గ్రామీణ యువతని వారు పనిచేస్తున్న సంస్థ ప్రతినిధులు, సహ ఉద్యోగుల సమక్షంలో సన్మానింపతల పెట్టినట్లు తెలిపారు. దీని వలన ఆ యువతలో ఆత్మ విశ్వాసం మరింత పెంపొందించిన వారమవుతామని ఆమె తెలిపారు. శిక్షణ ద్వారా ఉపాధి పొందిన యువత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని నిరుద్యోగ యువత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న డిడియుజికె వై పథకం ద్వారా వివిధ రకాలైన వృత్తి నైపుణ్యాలు నేర్చుకొని తద్వారా జీవితంలో మంచి ఉపాధిలో స్థిరపడడానికి దోహదపడుతోందని సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధి పొందిన యువతను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిడాప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్ఏ పులివర్తి నాని, మంచు మోహన్‌బాబు ఆత్మీయ కలయిక



చంద్రగిరి, జూలై 15 ప్రభాతవార్త: ఎంఎల్ఏ పులివర్తి నాని సోమవారం శ్రీవిద్యానికేతన్ విద్యా సంస్థల అధినేత మంచు మోహన్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మోహన్‌బాబు ఆత్మీయ పలకరింపుతో ఆహ్వానించారు. సార్వత్రిక ఎన్నికలలో విజయం సాధించిన నేపథ్యంలో వీరి కలయిక ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ సందర్భంగా ఇరువురు కలసి అల్పాహారం చేస్తూ యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. అనేక ఇబ్బందులను అధిగమించి ప్రజల మన్ననలు పొంది ఘన విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ క్రమంలో చంద్రగిరి అభివృద్ధికి సహకరించాలని ఎంఎల్ఏ కోరడంతో సామాజిక సేవల పట్ల తన ఆసక్తిని వివరిస్తూ తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఎంఎల్ఏ వెంట టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, నాయకులు హేమాంబరధరరావు, ఏజి పల్లి బాల, ముడిపల్లి సురేష్ రెడ్డి, గౌస్‌భాషా, తదితరులు వున్నారు.

## అదుపుతప్పి స్కూటర్ బోల్తా .. వ్యక్తి మృతి

రామచంద్రాపురం, జూలై 15 ప్రభాతవార్త: రాయలచెరువు కట్ట - నెత్తకుప్పం ప్రధాన రహదారి ఎన్‌ఆర్ కమ్మపల్లి భారతం మిట్ట సమీపంలో సోమవారం స్కూటర్ అదుపుతప్పి బోల్తా పడటంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. నెత్తకుప్పం హరిజనవాడకు చెందిన గోపి కుప్పంబాదూరులోని హోటల్లో పనిచేస్తున్నాడు. ఇందులో భాగంగా హోటల్‌కు వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ప్రమాదవశాత్తు బోల్తా పడ్డాడు. ఈ ప్రమాదంలో గోపికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వైద్య చికిత్సల నిమిత్తం ఆటోలో తరలిస్తుండగా తిమ్మరాజుపల్లి వద్ద మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి.

## ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న యువకులు

నగరి, జూలై 15 ప్రభాతవార్త: నగరి మున్సిపాలిటి తెరణి పంచాయతీ పరిధిలోని కుశస్థలీనదిలో యథేచ్ఛగా తోడేస్తున్న ఇసుక ట్రాక్టర్లను తెరణి యువకులు అడ్డుకున్నారు. కుశస్థలీ నదిలో తెరణి దళితవాడకు సంబంధించిన శ్మశానికి వెళ్లే దారిని పూర్తిగా తోడేస్తున్న ట్రాక్టర్ యజమానులు స్థానిక దళితవాడకు సంబంధించిన యువకులు ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దార్‌కి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ తెరణి వీఆర్‌వోని పంపించి స్థానిక యువకులు పట్టుకున్న రెండు ట్రాక్టర్లను వీఆర్‌వోకి అప్పగించారు. ఇదే విధంగా రాత్రి, పగలు తేడా లేకుండా తమిళనాడుకి ఇసుక తరలిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీని మీద దక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానిక యువకులు డిమాండ్ చేశారు. ఇకనైనా ఇసుక దోపిడీని అరికట్టాలని యువకులు డిమాండ్ చేశారు. ఇదే విధంగా కొనసాగితే రోడ్ల మీదకు వచ్చి పోరాడుతామని హెచ్చరించారు.

## విలీనం చేసిన పాఠశాలను మళ్లీ పెట్టించాలి

నగరి, జూలై 15 ప్రభాతవార్త: పీసీఎన్ ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన నగరి బాలికల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఇదివరకు లాగే నిర్వహించాలని పెరుమాళగుడి వీధికి చెందిన వారు ఎంఈవోలు శ్రీదేవి, నమఃశివాయంలకు వినతిపత్రం అందించారు. సోమవారం ఎమ్మార్సీ కార్యాలయానికి వెళ్లిన వారు 1933 నుంచి 90 సంవత్సరాల పాటు ఎంపీపీ బాలికల పాఠశాల పెరుమాళగుడి వీధిలో నిర్వహణలోఉందన్నారు. ఈ ప్రాంతం వారు బస్టాండ్ సమీపం ఉన్న పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చావడి సర్కిల్, బేరివీధి సర్కిల్ అంటూ రోడ్డు దాటుకుంటూ వెళ్లాల్సి ఉందన్నారు. దీంతో తల్లిదండ్రులు ఆ మార్గంలో పంపే సాహసం చేయలేక పోతున్నామన్నారు. వసతులు లేని సమయంలోనే తాము పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపేవారమని ప్రస్తుతం నాడు-నేడు పథకంలో పాఠశాలలు ఆకర్షనీయంగా ఉన్నా ప్రైవేటు పాఠశాలలకు పంపాల్సి వస్తోందన్నారు. 3,4,5 తరగతులను విలీనం చేసిన ప్రక్రియను రద్దుచేసి ఇది వరకు లాగే పాఠశాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విజయపురంలో పరిశ్రమలను ఏర్పాటు చేయండి: భానుప్రకాష్

విజయపురం, జూలై 15 ప్రభాతవార్త: నగరి నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటు చేసి పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి యువరాజ్‌ని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సోమవారం అమరావతిలో కలిశారు. పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దితే నియోజకవర్గం అభివృద్ధితో పాటు నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అనంతరం రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిర్మల రామానాయుడుని కలసి నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను, చెరువులు సప్లయ్ ఛానెల్స్ మరమ్మతుల మంజూరు గురించి చర్చించారు. వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

**CHANGE OF NAME**

I,**CHEVVA PUSHPALATHA** (old Name) R/ at H.No.3-85-3, Choppavaripalli, Nagavaram, Annamayya Dist.A.P. My husband's Passport No.T8261213. Have changed my name as (New Name) **CHEVVU PUSHPALATHA** W/o Chevvu Srinivasulu Reddy.

## స్మార్ట్ సిటీ నిధుల అక్రమార్కులను ఊచలు లెక్కిస్తాం:బిజెపి



తిరుపతి హెల్త్, జూలై 15 ప్రభాతవార్త : తిరుపతిలోని 2015వ సంవత్సరం కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం స్మార్ట్ సిటి మిషన్ కోసం లక్షా 86 వేల కోట్ల రూపాయిలతో ప్రారంభించారని ఆ నిధుల అక్రమార్కులను ఊచలు లెక్కిస్తామని బిజెపి నాయకులు పేర్కొన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడుతూ రూ. 1600 కోట్ల అంచనాలతో తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొఏషన్ టిఎస్‌సిసిఎల్ ఏర్పాటు అయిందన్నారు. గత ఐదు సంవత్సరాలలో జరిగిన అవకతవకలపై శ్వేత పత్రం విడుదల చేయాలి. వినాయక సాగర్ అభివృద్ధి పనులలో కానరాని అభివృద్ధి, గతంలో అక్రమాలకు పాల్పడ్డ వారిపై నగర పాలక సంస్థ కమిషనర్ చర్యలు చేపట్టాలి. జిమ్, ఫస్ ఎసెంటర్ కనిపించని స్విమ్మింగ్ పూల్, బేబీ స్విమ్మింగ్ పూల్, చిల్డ్రన్ ప్లే ఏరియా, ఆర్టిఫిషియల్ గ్లో లైటింగ్ నిర్మాణంలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. కాలువలు, డ్రైనేజీలు నిర్మాణం చేయకుండా ప్రచారం కోసం కొత్త రోడ్ల పనులు చేశారు. కొద్ది పాటి వర్షానికి తటాకంలా కనిపిస్తున్న కొత్త రోడ్లు, శిలాఫలకాలపై మాత్రమే కనిపిస్తున్న కాలువల నిర్మాణంతో కలిపి అంచనాలు వేసారన్నారు. స్మార్ట్ స్ట్రీట్స్, అధునాతన నడక దారి, పేవ్‌మెంట్స్ నిర్మాణం కోసం శ్రీనివాస సేతులో భాగంగా కేటాయించిన 90 కోట్ల నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. దురాక్రమణల నుండి ఫుట్ పాత్‌లతను ప్రజలకు, యాత్రికులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సుమారు 1200 కోట్ల రూపాయిలు నిధులు అసంపూర్ణంగా జరిగిన స్మార్ట్ సిటీ పనులకు ఎపోగా, ఇప్పుడు కేవలం రూ. 50 లక్షల రూపాయిలు మాత్రమే టిఎస్ సిసిఎల్ మిగిలి ఉండడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. గత ప్రభుత్వహయాంలో జరిగిన అక్రమాల, అవకతవకలపై మరిన్ని వివరాలతో త్వరలో బిజెపి ముందుకు వస్తుందన్నారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్రఅధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్‌తో పాటు నాయకులు వరప్రసాద్, అజయ్ కుమార్, డాక్టర్ శ్రీహరిరావు, పొనగంటి భాస్కర్,నవీన్ రాయల్, రెడ్డి బాబులు పాల్గొన్నారు.

## మహాభారతంలో సంప్రదాయ దస్తులతో విదేశీలు హాల్‌చల్



పాలసముద్రం, జూలై 15 ప్రభాతవార్త: పాలసముద్ర మండలం బలిజకండ్రిగ శ్రీద్రౌపదమ్మ అమ్మవారి మహాభారత ఉత్సవాల్లో ఆదివారం రాత్రి కొంతమంది విదేశీయులు సంప్రదాయ దుస్తులు ధరించి హాల్‌చల్ చేశారు. గత కొన్ని రోజులుగా బలిజకండ్రిగ శ్రీద్రౌపదమ్మ అమ్మవారి మహాభారత ఉత్సవాలు జరుగుతుండటంతో రాత్రి సమయంలో నాటకం వుంటుంది. ఆదివారం జరిగిన రాత్రి నాటకానికి జర్మనీ దేశానికి చెందిన కొంతమంది విదేశీయులు మన సంప్రదాయ దుస్తులు ధరించి హాజరై హాల్‌చల్ చేశారు. జర్మనీ దేశానికి చెందిన యువతీ యువకులు కొంతమంది తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను చూడటానికి వచ్చారు. ఈ క్రమంలో బలిజకండ్రిగ గ్రామంలో రాత్రి పూట మహాభారత ఉత్సవాల్లో భాగంగా నాటకం జరుగుతుందని తెలియడంతో దీనిని ఆసక్తిగా తిలకలించడానికి విదేశీయులు ఇక్కడి సంప్రదాయ దుస్తులను నాటకానికి ధరించి వచ్చారు. రాత్రి ఆటలో జర్మనీకి చెందిన విదేశీయులు హాల్‌చల్ చేయడంతో స్థానికులను ఈ విషయం విశేషంగా ఆకట్టుకొంది.

## కుప్పం రెస్కో నూతన ఎండిగా సోమశేఖర్ బాధ్యతలు



కుప్పం, జూలై 15 ప్రభాతవార్త : కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా సురభి సోమశేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా నూతన ఎండికి ఉద్యోగులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థ పరిధిలో ఉన్న వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందిస్తామన్నారు. అలాగే సంస్థ పరిధిలో ఉన్న బకాయిలను వినియోగదారులు చెల్లించి సంస్థ మనుగడకు సహకరించాలని కోరారు. సంస్థను లాభాల బాటలో పయనింపజేసేందుకు శక్తివ ంచన లేకుండా తాను పనిచేస్తానని 'ప్రభాతవార్త'కు తెలిపారు. అంతకుముందు రెస్కో ఎండి సోమశేఖర్ రెస్కో పర్సన్ ఇన్‌చార్జ్ అయిన జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును చిత్తూరులో మర్యాదపూర్వకంగా కలిశారు.

## ప్రతి ఫిర్యాదుకు జవాబుదారిగా ఉండాలి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జూలై 15 ప్రభాతవార్త : తిరుపతి నగరంలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుండి వస్తున్న ప్రతి ఒక్క ఫిర్యాదులపై అధికారులు జవాబుదారిగా ఉండాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ అధితి సింగ్ ప్రజల నుండి ఫిర్యాదులను, వినతులను స్వీకరించారు. డిప్యూటి మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ శ్రీనివాస సేతుపైనే కాకుండా క్రింది భాగంలో వేయాల్సిన రోడ్లను, బ్యూటిఫికేషన్ పనులను ఆప్కాస్ సంస్థ ఇంకా పూర్తి చేయాలేదని గడిచిన మూడు సంవత్సరాల కాలంలో జరిగిన పనులపై విచారణ చేయాలని, తాను ఇంతకు మునుపే తెలియజేసిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా 19వ డివిజన్ కార్పొరేటర్ ఆరణి సంధ్య వినతి పత్రం ఇస్తూ ఎమ్మార్వో ఆఫీస్, జీఎస్‌టి ఆఫీస్, ఏఆర్ పోలీస్ గ్రౌండ్, భాస్యం ప్రాంతాల్లో రోడ్లు కాలువలు పూర్తిగా పాడైనాయని పరిశీలించి కొత్తగా నిర్మించాలన్నారు. అనంతరం 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహాచారి, 31వ డివిజన్ కార్పొరేటర్ రేవతి వినతి పత్రం ఇస్తూ వారి డివిజన్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదే విధంగా కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజి సమస్యలు పరిష్కరించాలనే ఫిర్యాదులపై కమిషనర్ అధితి సింగ్ స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కెఎల్ వర్మ, డిప్యూటీ సిటి ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అడిషనల్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, మేనేజర్ చిట్టిబాబు, డిఈలు సూపరింటెండెంట్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించండి : మేయర్



తిరుపతి కార్పొరేషన్, జూలై 15, ప్రభాతవార్త : పరిసరాల, పరిశుభ్రతను ప్రతి రోజు పారిశుద్ధ్య డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని 27వ డివిజన్ సచివాలయ సిబ్బందిని నగర మేయర్ ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ చాంబర్ నందు వార్డు సచివాలయ సిబ్బందితో మేయర్ సమీక్ష నిర్వహించారు. రాబోయే వర్షాకాలం సందర్భంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి పరిశుభ్రత పాటించాలని తెలియజేశారు. రాబోయే వర్షాకాలంలో డయేరియా, మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా వంటి రోగాల భారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెద్ద కాలువలు, చిన్న కాలువలు తరచూ శుభ్రం చేయించాలని ఇంటి సమీపంలో నీరు నిల్వకుండా చూడాలని దోమలు వ్యాపించకుండా దోమల మందుస్ప్రే చేయించాలని తెలిపారు. నగరంలోని ఇంటి వద్ద త్రాగునీరులో డ్రైనేజ్ కలుషితం అయినట్లు తెలిసిన వెంటనే తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్ప్ లైన్‌కు 0877-2256766కు ఫోన్ ద్వారా ఫిర్యాదులు తెలియజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలకృష్ణ, పల్లవి, వాసు, మాధవి, హరిత, ఉష, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కామరాజు నాడార్ 122వ జయంతివేడుకలు



తిరుపతి హెల్త్, జూలై 15, ప్రభాతవార్త : తిరుపతి లీలామహల్ వద్ద సోమవారం కామరాజు నాడార్ 122వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి మాజీ శాసన సభ్యురాలు సుగణమ్మ, బిజెపి నాయకులఉ భానుప్రకాష్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, గుండాల గోపినాథ్ రెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. తిరుపతిలోని నాడార్ల సంఘం రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ కిరణ్ కుమార్, తిరుపతి జిల్లా అధ్యక్షులు ఆనంద్ ఆధ్వరనయంలో అధిక సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. భారతరత్న అవార్డు గ్రహీతగా భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో కార్యకర్తగా కీలక పాత్ర పోషించిన వ్యక్తి క్విట్ ఇండియా ఉద్యమంలో జైలు జీవితం గడిపి దేశం కోసం బ్రహ్మచారిగా నిస్వార్ధ సేవలు అందించిన మహనీయులు. కామరాజు నాడార్ సేవలు చిరస్మరణీయమని

# గురుకులాలను చక్కదిద్దుతాం : ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, జూలై 15 ప్రభాతవార్త : సూళ్లూరుపేట నియోజక వర్గంలో ఉన్న గురుకులాలను చక్కదిద్దేందుకు త్వరితగతిన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. సోమవారం నాయుడుపేట గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులు సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వారిని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో గురుకుల పాఠశాలలను నిర్లక్ష్యం చేశారని తెలిపారు. దీంతో గురుకులంలో సమస్యలు ఎక్కువయ్యాయని ఆమె చెప్పారు. నాయుడుపేట గురుకుల పాఠశాలలో మరుగు దొడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఈ విషయమై ప్రశ్నిస్తే మరుగు దొడ్లు శుభ్రం చేసే పారిశుధ్య కార్మికులకు జీతాలు సక్రమంగా చెల్లించకపోవడం, తగినంత సిబ్బంది లేకపోవడం వల్ల ఇటువంటి పరిస్థితి నెలకొని ఉందని తెలిపారు. అలాగే సూళ్లూరుపేట గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు అధ్వానంగా ఉన్నాయన్నారు. నాయుడుపేట గురుకుల పాఠశాలలో సుమారు 160 మందికి పైగా విద్యార్థులు కలుషిత ఆహారం బారినపడి అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. వీరిలో కొంతమంది నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స పొందు తున్నారని చెప్పారు. ఇద్దరు విద్యార్థుల పరిస్థితి కొంత తీవ్రంగా ఉండటంతో వారిని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. నాయుడుపేట ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా ర్థులకు మానవతా దృక్పథంతో సేవలు అందించాల్సిందిపోయి నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిపద్ధతి కాదన్నారు. నాయుడుపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పాఠశాలలో నివాసం ఉండకుండా తాల్వాయిపాడు గ్రామంలో ఉంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆయనపై చర్యలు తీసుకుంటామని విజయశ్రీ చెప్పారు. సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రిలో 17 మంది విద్యార్థులు చికిత్స పొందుతున్నారని, వీరం దరూ క్షేమంగానే ఉన్నట్లు చెప్పారు. సూళ్లూరుపేటలోని గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ స్థానికంగా ఉండటం లేదన్న ఆరోపణలపై ఆమె స్పందిస్తూ ఇటువంటి వారి పట్ల ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలల్లో సిబ్బంది, అధ్యాపక బృందం మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంలో నిరంతరం తన పర్యవేక్షణ ఉంటుందని విజయశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి నేతలు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఇవి సురేష్, దంతాల రవి, బొమ్మన్ శ్రీధర్, షేక్ రఫీ, చంద్రయ్య, కొండయ్య, ఎజి కిషోర్, ఆలీబాషా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

### వార్త ప్రభావం..పరుగులు తీసిన వైద్య బృందం

## అతను ఆర్ఎంపీ కాదు..పిఎంపీ కాదు!



గంగవరం, జూలై 15, ప్రభాతవార్త : మండలంలో 'ఆర్ఎంపీ డాక్టర్ వైద్యం, అనంతలోకాలకు పయనం..! భర్త ఆదేశాలతో.. ఇంజక్షన్ వేసిన భార్య, గాలిలోకి కలిసిన ప్రాణం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసిన వైనం' అనే శీర్షికతో సోమవారం వార్త దిన పత్రికలో ప్రచురితమైంది. వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్పందించింది. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్,జిల్లా వైద్యాధికారిని ప్రభావతిదేవి ఆదేశాల మేరకు గవగవరం వైద్యాధికారి శ్రీనివాసులు, వైద్యాధికారిని లహరిలు తమ వైద్య బృందంతో కలిసి మండలంలోని కలగటూరు పంచాయతీ అరసనపల్లె గ్రామం వెళ్ళి గోపాల్‌రెడ్డిని విచారించి, అతని ఇంట్లో తనిఖీలు చేయగా వైద్య బృందం షాక్ గురయ్యారు. గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి అసలు డాక్టరే కాదని డూప్లికేట్ డాక్టర్ అని వైద్య బృందం తేల్చారు.గ్రామీణుల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని గత పాతికేళ్ళపాటు పలమనేరు పట్టణం,అరసనపల్లె గ్రామాల్లో నకిలీ వైద్యుడిగా చెలామణీ అవుతున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.వైద్య రంగానికి సంబందించి ఎలాంటి విద్యను అభ్యసించకపోగా కనీసం ఆర్ఎంపీ,పిఎంపీ సర్టిఫికేట్‌లు కూడా లేవని తేలింది.అదే విధంగా వైద్య చికిత్సకు సహకరిస్తున్న అతని భార్య ప్రమీలమ్మ కూడా ఎలాంటి నర్సింగ్ కోర్సులు చేయనట్లు వైద్య బృందం గుర్తించారు. అలాగే నకిలీ వైద్యుడి ఇంట్లో ఎలాంటి అనుమతులు లేకుండా వైద్య చికిత్సకు వాడే పరికరాలు,అక్రమంగా మందులు నిల్వ ఉంచినట్లు వైద్యులు గుర్తించారు.విచారణో,తనిఖీల్లో తేలినవిషయాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు వైద్యాధికారులు తెలిపారు.ఈ తనిఖీల్లో వైద్యాధికారులతో పాటు సిహెచ్ఓ మనోరమ,సిబ్బంది ధనభాగ్యం,పద్మశ్రీ,మౌనిక,సెల్వి,ఆశ వర్కర్లు జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే రామకృష్ణ



వెంకటగిరి, జూలై 15, ప్రభాతవార్త : నెల్లూరు జిల్లాలో రాపూర్, కలవాయి, సైదాపూర్ మండలాలు ఉండడ తో జిల్లా కలెక్టర్ ఆనంద్‌ని, డిప్యూటీ కలెక్టర్ ఎస్. మాధవ్, ఎస్పీ కృష్ణకాంత్‌లను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కార్యాలయాల నందు మర్యాదపూర్వంగా కలిసి వారికి పుష్పగుచ్ఛం అందజేశారు. వారితో పలు అంశాలు చర్చించారు. భేటీలో శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ముఖ్యంగా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులతో చర్చించారు.

## అభిషేక ప్రియా మృత్యుంజయా పాహిమాం!



చౌడేపల్లి, జూలై 15 ప్రభాతవార్త : అభిషేక ప్రియా మృత్యుంజయా అంటూ భక్తులు మొకరిల్లి నమస్కరించారు. స్థానిక ప్రసన్న పార్వతీ సమేత అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది.

## కుక్కల దాడి నుంచి దుప్పిని రక్షించిన గ్రామస్తులు

చౌడేపల్లి, జూలై 15 ప్రభాతవార్త :ఎక్కడి నుంచో పొడుగాటి కొమ్ములున్న దుప్పి గ్రామంలోకి వచ్చింది. దాన్ని చూసిన వెంటనే శునకాలు ఒక్కసారిగా దాడికి పాల్పడగా ప్రజలు కాపాడారు. మండలంలోని పరికిదొన పంచాయతీ సామిరెడ్డిపల్లి, మదుకూరుకు సమీపంలో కందూరు అడవి వుంది. రాత్రి సమయంలో అడవిలోంచి ఓ దుప్పి గ్రామంలోకి వచ్చింది. గుర్తించిన గ్రామసింహాలు దుప్పిపై దాడికి పాల్పడ్డాయి. అప్రమత్తమయిన గ్రామస్తులు వాటినుంచి రక్షించి అటవీశాఖాధికారులకు అప్పగించారు.

## జలకంఠేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు



బంగారుపాళ్యం, జూలై 15 ప్రభాతవార్త: స్వయంభు శ్రీ మొగిలీశ్వరాలయంకు అనుబంధంగా దేవర కొండపై వెలసిన శ్రీ జలకంఠేశ్వరస్వామిని సోమ వారం పలమనేరు, పూతలపట్టు శాసనసభ్యులు ఎన్.అమరనాథరెడ్డి, డాక్టర్ ఎం.మురళీమోహన్‌లు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మొగిలి నుండి ప్రత్యేక వాహనంలో కొండపై వెలసిన జలకంఠేశ్వర ఆలయంకు ఎమ్మెల్యేలు చేరుకోగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను ఎమ్మెల్యేలకు అందజేశారు. మార్గమధ్యంలో గోశాల వద్ద జరుగుతున్న యాగశాల పూజలో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. గత ఐదు రోజులుగా గోశాల నందు యాగము, యాగపూజలు జరుగుతుండగా చివరిరోజైన సోమవారం యాగపూజలో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. యాద నిర్వాహకులు పాణ్యం శ్రీనివాసశర్మ ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికి యాగ పూజ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మండల టిడిపి అధ్యక్షుడు జయప్రకాష్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసు గ్రీవెన్స్‌కు 37 ఫిర్యాదులు

చిత్తూరు టౌన్, జూలై 15 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి చిత్తూరు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమంకు ప్రజలు హాజరై సమస్యలపై 37 అర్జీలు సమర్పించారు. ఈ అర్జీలను పరిశీలించిన ఎస్పీ మణికంఠ చందోలు సత్వరం పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ చందోలుతో పాటు అడ్మిన్ ఎఎస్పీ ఆరీఫుల్లా, మహిళా స్టేషన్ డిఎస్పీ సుధాకర్‌రెడ్డిలు పాల్గొని అర్జీదారుల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భూ తగాదాలపై 16, ఆర్థిక వ్యవహారాలపై 9, వేధింపులపై 4, ఆస్తి తగాదాలపై 5, కుటుంబ తగాదాలపై 3 అర్జీలు పోలీసు అధికారులకు అందాయి.

## స్పందించిన విద్యుత్ శాఖ : వార్తకు స్పందన



శ్రీకాళహస్తి,జూలై 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని పలు ప్రాంతాల్లో ప్రజలు విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్నారని ' వార్త దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'కరెంటు కోతలు: చీకట్లో కాపురాలు' అనే శీర్షికకు స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది పరుగులు తీసారు.ఎస్‌డికె నగర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. చెంచులక్ష్మీకాలనీకి విద్యుత్ సరఫరా చేస్తున్న ఫిడర్‌తో కాసాతోట,బసవయ్యాపాలెం, కన్నలి వరకు సరఫరా చేస్తున్నారు. గతంలో విభజించారు.కానీ మళ్లీ ఒకే ఫీడర్‌పై అందిస్తున్నారు.దాంతో పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. అయితే ఎస్‌డికె నగర్ విద్యుత్ ఫీడర్లను లైన్ మెన్ సుబ్రమణ్యం పరిశీలించారు. ఆదివారం రాత్రి కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గటంతో వేకువ జామున ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి మరమ్మత్తులు చేసి విద్యుత్ సరఫరాను అందించారు.

## సవ్యసాచి దివ్యదర్శనం



శ్రీకాళహస్తి,జూలై15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం అరు ్జనుడు దివ్యదర ్శనం ఇచ్చారు.మత్స్య యంత్రచ్ఛేదనం కార్యక్రమాల్లో భాగంగా అర్జున సమేత ద్రౌపదీదేవి, కృష్ణుడు ఉత్సవర్లను కన్నుల పండువగా ముస్తాబు చేశారు. ఆలయం వద్ద గల అలంకార మండపంలో అలంకార గురుకుల్ చక్కగా ముస్తాబు చేశారు. పట్టణంలోని జయరామారావువీధి, తేరువీధి, బజారువీధి,నగరి వీధి, నెహ్రూవీధుల గుండా ఊరేగింపు సాగింది. ఉత్సవంను ఆలయ ఇఒ ఎన్‌వియస్ఎన్ మూర్తి ఆదేశాలతో డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవాల ఇన్‌చార్జి దుర్గా ప్రసాద్, చిన్న ఆలయాల ఇన్‌చార్జి వెంకటస్వామి సారధ్యంలో ఉత్సవం సాగింది, పూజారి పురుషోత్తం,రఘు ఉభయదారులు కెవియస్‌నాయుడు కుటుంబసభ్యులు, గుప్తామెడికల్స్ అధినేత టి.జి ప్రభాకర్ గుప్తా కుటుంబసభ్యులు హాజరయ్యారు.

## నేటి నుండి గోవిందరాజస్వామి జ్యేష్ఠాభిషేకాలు



తిరుపతిటౌన్,జులై 15ప్రభాతవార్త: తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో నేటి నుండి 18వరకు మూడురోజులు జ్యేష్ఠాభిషేకాలు జరగను న్నాయి. ఏడాదిలో మూడురోజులు ఉత్సవ మూర్తులకు స్వర్ణకవ చాలు తొలగించి శుద్ధిచేసి తిరిగి అయర్పుతారు. అబిదేయక అభిషేకాల్లో తొలిరోజు 16వతేదీ మంగళవారం కవచాదివాసం, 17 కవచప్రతిష్ట, 18న కవచ సమర్పణ నిర్వహి స్తారు. ఈ ఉత్సవాలుసందర్భంగా మూడురోజులు ఉదయం ఆలయంలో మహాశాంతి హోమం, పుణ్యాహవచనం చేపడతారు. ఉదయం స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, తిరువీధి ఉత్సవం ఉంటాయి.

## నూతన ఎస్పీ సుబ్బరాయుడుకు... పలువురు శుభాకాంక్షలు



తిరుపతిటౌన్, జులై 15ప్రభాతవార్త: తిరుపతి జిల్లా నూతన ఎస్పీగా సోమవారం బాధ్యతలు చేపట్టిన ఎల్.సుబ్బరాయుడును పలువురు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీసి ఆర్ఎం చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సిటిఎం ఎం.భాస్కర్, టిడిపి ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పు ష్పగుచ్ఛాలందజేశారు.

## టిటిడి ఈఓ శ్యామలరావుతో ఎస్పీ



తిరుపతిటౌన్, జులై 15ప్రభాతవార్త: తిరుపతి నూతన జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎల్.సుబ్బరాయుడు సోమవారం సాయంత్రం టిటిడి ఈఓ శ్యామలరావును కలిశారు. మర్యాదపూర్వక ఈ భేటీలో పుష్పగుచ్ఛం అందించి కొద్దిసేపు చర్చించుకున్నారు.

## సంస్కృత వర్శిటీకి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్



తిరుపతి విద్య, జులై 15 ప్రభాతవార్త : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ బ్ర. జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొ. ఆర్.జె. రమాశ్రీ, అకాడమిక్ డీన్ ప్రొ. రజినీకాంత శుక్ల, ఐక్యుఏసి డైరెక్టర్ ప్రొ. సతీశ కెఎస్, పిఆర్ఓ ప్రొ.వి. రమేష్ బాబు ఆధ్వర్యంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సంస్కృతి విద్యా పీఠంగా ఉన్నటువంటి ఈ విద్యా పీఠానికి నేషనల్ సంస్కృతి యూనివర్సిటీ హోదా వచ్చిన తర్వాత నేక్ ద్వారా మూడవ సైకిల్‌లో ఏ ప్లస్ గ్రేడ్ సంపాదించడం విశ్వవిద్యాలయానికి మాకు అందరికీ గర్వకారణమని అని వివరించారు. ఈ న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సంపాదించడం కొరకు విశ్వవిద్యాలయంలో ఉన్నటువంటి ప్రతి అధ్యాపకులు, ఉద్యోగులు ఎంతో కష్టపడి పని చేశారని, విశ్వవిద్యాలయం బోధిస్తున్నటువంటి ప్రమాణాలకి ప్రతి రూపమే ఈ న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ అని అన్నారు. ఈ న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ ద్వారా విశ్వవిద్యాలయానికి భవిష్యత్తులో ఎన్నో కొత్త కొత్త కోర్సులు, నూతన విద్యా కార్యక్రమాలు వివిధ ప్రాజెక్టులు, పరిశోధనలు, ఎక్కువగా తీసుకురావడం వీలవుతుందని వివరించారు. సంస్కృత భాషను ప్రసార ప్రచారం చేయాలని, తద్వారా సంస్కృత భాషను ప్రసార ప్రచారం చేయాలని, తద్వారా సంస్కృత భాషను, భారతీయ సంస్కృతిని అందరికి తెలియజేయాలని ఈ సందర్భంగా ఆయన వివరించారు. విశ్వవిద్యాలయంలోని ప్రతి ఒక్కరికి ఆయన అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొ. కె. కదాంబిని, ప్రొ. ఆర్. దీప్త, ఎపిఆర్ఓ డా. కనపాల కుమార్, డా. బుల్టిదాస్, న్యాక్ ఎస్ఎస్ఆర్ కమిటీ సభ్యులు, డివివి కమిటీ సభ్యులు విశ్వవిద్యాలయ అధ్యాపకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల కట్టడే లక్ష్యంగా విధులు

### - కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలులు

చిత్తూరు టౌన్, జూలై 15 ప్రభాతవార్త: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా సమిష్టిగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలులు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు ఎస్పీ మణికంఠ చందోలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 379 రోడ్డు ప్రమాదాల్లో 170 మంది మృతి చెందారని, రోడ్డు ప్రమాదాలను పూర్తి స్థాయిలో కట్టడి చేయడానికి సంబంధిత శాఖలు సమిష్టిగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలోని జాతీయ రహదారుల్లో ఎక్కువ ప్రమాదాలు జరిగే 26 ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, ఈ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారుల వెంట వున్న పిహెచ్‌సిలు, సిహెచ్‌సిల్లో ప్రమాదాల క్షతగాత్రులకు అవసరమైన రక్తంను అందించడానికి అవసరమైన రక్తంను అందుబాటులో వుంచుకొనేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే రాత్రి వేళల్లో పిహెచ్‌సి, సిహెచ్‌సిల్లో డాక్టర్లు అందుబాటులో వుండేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డిసిహెచ్ఎస్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రుల్లో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు చికిత్స చేయడానికి అవసరమైన పడకలను కేటాయించాలని, అలాగే అవసరమైన మందులు అందుబాటులో వుంచుకోవాలని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్‌ను ఆదేశించారు. అలాగే ప్రమాదాల్లో మృతి చెందిన వారికి సంబ ంధించి ధృవపత్రాలు, క్లెయిముల పరిష్కారంలో ఆర్డీఓలు, తహసిల్దార్లు సత్వరం స్పందించి బాధితులకు న్యాయం చేయాల న్నారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రహదారి భద్రతా నియమాలను తప్పక పాటిస్తే ప్రమాదాలు కట్టడి చేయవచ్చునన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల మీద వున్న ప్రేమతో వాహనాలు ఇవ్వడం ద్వారా అతివేగం వల్ల జరిగే ప్రమాదాల్లో ఆ పిల్లల ప్రాణాలు బలిగొన్న సంఘటనలు అనేకం వున్నాయని గుర్తించుకోవాలన్నారు. ఈ సమావేశంలో అడ్మిన్ ఎఎస్పీ ఆరీఫుల్లా, డిటిసి నిరంజన్‌రెడ్డి, ఎన్‌హెచ్ పిడి కార్తీక్ రెడ్డి, పిఆర్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఇ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం జితేంద్రనాథ్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ